సాక్షి ఖమ్మం

మంగళవారం । 30 । జనవరి । 2024



ఆలయాలకు ధర్మకర్తల మండళ్లు

ఉమ్మడి జిల్లాలోని 19 దేవాలయాలకు పాలకమండళ్ల నియామకానికి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి.

10లో



ఊరించి.. ఉసూరుమనిపించి

ఏకగ్రీవంగా పాలకవర్గాలు ఎన్నికైన గ్రామ పంచాయతీల పదవీకాలం ముగియవస్తున్నా ప్రోత్సాహక నగదు అందలేదు.

8లో

గరిష్టం / కనిష్టం
31° / 16°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం, రాత్రివేళ చలి ప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

రేపు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశాక, కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. ఆతర్వాత బురేన్‌గుట్ట తండా నుండి గోరిలపాడు తండా వరకు, రాజుపేట, పెరికసింగారం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుండి గోరిలపాడు తండా వరకు నిర్మించే బీటీ రోడ్లు, కూసుమంచిలో హోమియోపతి ఆస్పత్రి, లింగారం తండాలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం సాయంత్రం 5గంటల నుండి ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజలు, నాయకులకు మంత్రి పొంగులేటి అందుబాటులో ఉంటారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి వెల్లడించారు.

ఆరు జిల్లాల మత్స్యకారులకు శిక్షణ



మాట్లాడుతున్న రిటైర్డ్ శాస్త్రవేత్త లవకుమార్

కూసుమంచి: మండలంలోని పాలేరులో ఉన్న శ్రీ పీవీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో 'చేపల పెంపకంలో మెరుగైన యాజమాన్య పద్ధతులు' అంశంపై సోమవారం శిక్షణ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు శిక్షణలో ఖమ్మం, సూర్యాపేట, వనపర్తి, మెదక్, నల్లగొండ, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల మత్స్యకారులు పాల్గొన్నారు. తొలిరోజు శిక్షణను సూర్యాపేట జిల్లా గడ్డిపల్లిలోని కేవీకే రిటైర్డ్ సైంటిస్ట్ లవకుమార్ ప్రారంభించి మాట్లాడుతూ భవిష్యత్‌లో మత్స్య సందపను రెట్టింపు చేసేందుకు ఇలాంటి శిక్షణలు దోహదపడుతాయని తెలిపారు. పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్ మాట్లాడగా శాస్త్రవేత్తలు శాంతన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్‌లుగా 325 మంది ఎంపిక



కౌన్సెలింగ్ హాజరైన ఎంపికైన అభ్యర్థులు

ఖమ్మం వైద్యవిభాగం: స్టాఫ్‌నర్స్‌లుగా ఎంపికైన వారి జాబితాను రాష్ట్రప్రభుత్వం తాజాగా విడుదల చేయగా ఇందులో జిల్లా నుంచి 325 మంది ఉన్నారు. వీరికి ఈనెల 31న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈమేరకు అభ్యర్థుల ధ్రువపత్రాలను సోమవారం ఖమ్మంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పరిశీలించారు. ఆతర్వాత అభ్యర్థుల వివరాలు, హాల్‌టికెట్, ఆధార్‌కార్డ్ ఆధారంగా ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేశారు. ఈ కార్డులతో ఎల్‌బీ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. అక్కడ నియామకపు పత్రాలు తీసుకున్నాక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రిపోర్టు చేస్తే ఖాళీల ఆధారంగా పోస్టింగ్ ఇవ్వనున్నారు.

విద్యార్థుల ప్రగతిపై ప్రత్యేక దృష్టి



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న సీఎంఓ

కామేపల్లి: ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిని పరిశీలిస్తూ వారి ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యాశాఖ సీఎంఓ వై.రాజశేఖర్ సూచించారు. కామేపల్లి మండలంలోని గరిడేపల్లి ప్రభుత్వ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి విద్యార్థుల ప్రగతి, ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు తీరు, పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అనంతరం సీఎంఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. సర్పంచ్ ధరావాత్ రాంజీ, హెచ్‌ఎం గుడిపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జర్పుల దేవాసింగ్, సుంకు నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఎర్రబంగారం!



ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి వివిధ జిల్లాల రైతులు తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మం మార్కెట్‌కు 41,252 బస్తాల సరుకు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి పోటెత్తింది. గత గురువారం క్రయవిక్రయాల అనంతరం వరుస సెలవులు రాగా సోమవారం మార్కెట్ తెరుచుకుంది. దీనికి తోడు పంట కోతలు పెరగడంతో ఒకేరోజు 41,252 బస్తాల మిర్చిని రైతులు తీసుకొచ్చారు. ఇందులో ఎర్రమిర్చి 34,682 బస్తాలు, తాలు మిర్చి 6,570 బస్తాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఖమ్మం, భద్రాద్రి, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలే కాక ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి రైతులు ఆదివారం అర్ధరాత్రి నుంచే మార్కెట్‌కు చేరుకోవడం మొదలుకాగా సోమవారం ఉదయంకల్లా యార్డుల్లో ఎక్కడ చూసినా మిర్చి బస్తాలే కనిపించాయి. కాగా, ఎర్రమిర్చి జెండా పాట ధర రూ.21,300 పలకగా, మోడల్ ధర రూ.19వేలు, కనిష్ఠ ధర రూ.14వేలుగా నమోదైంది. ఇక తాలు మిర్చికి గరిష్ఠంగా రూ.12వేలు, కనిష్ఠంగా రూ.7,500 ధర లభించింది. గత గురువారం ఎర్రమిర్చికి ధర రూ.21వేల ధర పలకగా.. సోమవారం మరో రూ.300పెరగడంతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

అనుక్షణం కష్టపడి పనిచేస్తాం..



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యేలు రాగమయి, ఆదినారాయణ తదితరులు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- బుగ్గపాడులో ఫుడ్‌పార్క్ పరిశీలన

సత్తుపల్లి: ఇష్టపడి తమను గెలిపించిన ప్రజల కోసం అనుక్షణం కష్టపడి పని చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సత్తుపల్లి మండలం బుగ్గపాడు ఫుడ్‌పార్కులోని కోల్డ్‌స్టోరేజ్‌ను ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, జారె ఆదినారాయణతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇక్కడి రైతులు సాగు చేస్తున్న కొబ్బరి, మామిడి, జీడిమామిడి, కోకో, అరటి, పుచ్చకాయ పంటలు దాచుకునేలా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను అభివృద్ధి చేస్తానని తెలిపారు. అలాగే, కూరగాయల పంటలను ప్రాసెసింగ్ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రైతు వేదికల్లో అవగాహన

రాష్ట్రంలోని 2,500 రైతు వేదికల్లో ఆధునిక వ్యవసాయంపై శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులతో రైతులందరికీ మేలు జరిగేలా అవగాహన కల్పిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈమేరకు రైతు వేదికల్లో దశల వారీగా డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటుచేయిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులు, ఎక్కడ, ఏ భూమిలో ఎలాంటి పంటలు సాగు చేయాలనే అంశంపై శిక్షణలు ఇప్పిస్తామన్నారు. దీంతో రైతులు నష్టపోకుండా చూస్తూనే ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ పవన్‌కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్‌కుమార్, ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, మేనేజర్ సురేష్, డీజెడ్‌ఈ స్మరత్‌చంద్ర, ఏఈ రెహమాన్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని తీసుకొస్తా..

సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపైనే ప్రాధాన్యత కనబరిచారని తుమ్మల తెలిపారు. రైతులు పండించిన పంటలు భూమి పాలు కాకుండా సీఎం ఆలోచనలు చేస్తున్నారని చెప్పారు. వచ్చే నెలలో సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును ఇక్కడకు తీసుకొచ్చి ఫుడ్‌పార్కును మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. కాగా, కొణిజర్లలో రూ.500 కోట్లతో పామాయిల్ సీడ్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా పామాయిల్ విత్తనాల కోసం ఇతర దేశాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని వెల్లడించారు. కొణిజర్లలో ప్లాంట్‌కు సంబంధించి గోద్రెజ్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

ముత్తంగి అలంకరణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలంలో సీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈసందర్భంగా తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించిన అర్చకులు నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

ఠాణాల్లో వసూల్ రాజాలు

- ఎస్‌హెచ్‌ఓలకు అంతా తామై వ్యవహరిస్తున్న రైటర్లు
- ఏళ్ల తరబడి ఒకే స్టేషన్‌లో తిష్ట
- అదే అదునుగా వసూళ్లపర్వం



ఖమ్మంక్రైం: పోలీస్‌స్టేషన్లకు సంబంధించి కార్యకలాపాలన్నీ నమోదు చేసే బాధ్యత రైటర్లదే. వీరందరూ హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగులు. ఒక్క మాటలో చెప్పాలంటే స్టేషన్‌లో పనిచేసే ఉద్యోగుల్లో వీరే కీలకం. అంతటి బాధ్యత కలిగిన రైటర్లు ఇదే అదునుగా వసూల్ రాజాలుగా మారి పోలీస్‌శాఖకు మచ్చ తీసుకొస్తున్నారు. ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే రైటర్ పి.కోటేశ్వరరావు ఠాణా ఎదురుగానే సోమవారం రిటైర్డ్ పోలీసు ఉద్యోగి కుమారుడి నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడడం కలకలం రేపింది. అయితే, ఈయనొక్కడే కాదు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో రైటర్లుగా విధులు నిర్వర్తిస్తున్న వీరు ఫిర్యాదుదారులు, నిందితుల వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కీలక విధులు

పోలీస్‌స్టేషన్లలో రైటర్లది కీలకమైన పాత్ర అని చెప్పొచ్చు. స్టేషన్లకు సంబంధించి కేసుల పంచనామాలు రాయటంతో పాటు సీడీ(కేసు డైరీ), ఎస్‌ఓసీలు తదితర అంశాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అంతేకాకుండా స్టేషన్‌లో సిబ్బందికి డ్యూటీలు, బందోబస్తు విధులు కూడా వీరే కేటాయిస్తుంటారు.

ఒకేచోట పాతుకుపోయి...

జిల్లాలోని చాలామంది రైటర్లు ఒకే స్టేషన్‌లో ఏళ్లుగా తిష్ట వేశారని.. తద్వారా వారి అక్రమ సంపాదనకు అడ్డు లేకుండా పోయిందని తెలుస్తోంది. కొందరు రైటర్లు ఇతర స్టేషన్లకు బదిలీ అయినా 'అవసరం' పేరిట ఎస్‌హెచ్‌ఓల పైరవీలతో అటాచ్‌మెంట్ల ద్వారా మళ్లీ పాత స్టేషన్‌కు రావడం పరిపాటిగా మారింది. కొన్ని స్టేషన్‌లలో పదిహేనేళ్లుగా కూడా పనిచేస్తున్న రైటర్లు ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా స్టేషన్ బెయిల్ విషయంలో వీరికి మంచి లాభం ఉంటుందని.. దీనికితోడు సెటిల్‌మెంట్లు, నెలనెలా వచ్చే మామూళ్లు సైతం రైటర్లే వసూలు చేసి తమ జేబు నింపుకున్నాక అధికారులకు వాటాలుగా ఇస్తారని చెబుతున్నారు. అలాగే, ఇంకొందరు రైటర్లు తమకు అనువుగా ఉండే కానిస్టేబుళ్లను డబ్బా రైటర్లుగా పనిచేయిస్తూ వారి ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. వసూళ్ల విషయంలో నిందితులు, ఫిర్యాదుదారులే కాక సొంత శాఖ సిబ్బందిని వదలరని తెలుస్తోంది. ఖమ్మం టు టౌన్ ఘటనతోనైనా జిల్లాలోని స్టేషన్ల రైటర్ల దందాపై అధికారులు దృష్టి సారించాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నారు.

అంతా వారే...

స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలకు రైటర్లే అంతా అయి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు ఎన్‌ఓసీలు, ఏదైనా సర్టిఫికెట్లు తీసుకోవాలంటే వీరికి డబ్బు ముట్టచెప్పాల్సిందేనని తెలుస్తోంది. అలాగే, ప్రతీ కేసు నమోదు విషయంలో అటు ఫిర్యాదుదారులు, ఇటు నిందితుల నుంచి డబ్బు వసూలు చేసి అధికారులకు వాటాలుగా ఇస్తారనే విమర్శలు వస్తున్నాయి. దీంతోనే రైటర్ల వ్యవహార శైలి తెలిసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తారనే ప్రచారం జరుగుతోంది.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

- గ్రీవెన్స్ డేలో కలెక్టర్ గౌతమ్
- పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ప్రతీ ఫిర్యాదును పరిశీలించి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. గ్రీవెన్స్ డేలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఫిర్యాదును పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.

ఫిర్యాదు.. ఆ వెంటనే పరిష్కారం

గ్రీవెన్స్ డేలో ఎక్కువగా రెవెన్యూ సంబంధిత అంశాలపైనే ఫిర్యాదులు అందాయి. ఈమేరకు పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన మనికాల గోపాలరావుకు సంబంధించి భూమిలో 0.18 గుంటల మేర రికార్డుల్లో నమోదు కాలేదని ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ సర్వే నంబర్‌పై మ్యుటేషన్ సమస్య పరిష్కరించారు. అలాగే, కూసుమంచి మండలం నాయకన్‌గూడెంకు చెందిన కంచెర్ల పూలమ్మ తన భూమి పాస్‌పుస్తకంలో తక్కువగా నమోదైందని చెప్పగా... పాత రికార్డుల ఆధారంగా మొత్తం భూమిని నమోదు చేయించారు. ఇక కల్లూరు మండలానికి చెందిన యనమల సోమయ్య సైతం భూరికార్డుల సవరణ కోసం దరఖాస్తు చేసుకోగా తక్షణమే పరిష్కరించారు. బోనకల్ మండలం చొప్పకట్లపాలెంకు చెందిన కోటపర్తి నాగేశ్వరరావు భూమికి సంబంధించిన సవరణను సైతం కలెక్టర్ అక్కడికక్కడే పూర్తిచేయించడంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.



గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై ఆయన సమీక్షించారు. ఇంటర్ విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నందున ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని తెలిపారు. అలాగే, ఇంగ్లిష్ ప్రాక్టికల్స్, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష నిర్వహణపై కూడా సూచనలు చేశారు.

2వేల మెట్రిక్ టన్నులకు పైగా సీఎంఆర్

జిల్లాలోని 35రైస్ మిల్లుల నుంచి 2,245.032 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) రావాల్సి ఉందని.. ఈ మొత్తం బియ్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన గడువైన 31వ తేదీలోగా అప్పగించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన అధికారులు, మిల్లర్లతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం విధించిన గడువును మరోమారు పొడిగించే ప్రసక్తే ఉండదన్నారు. ఈమేరకు మిల్లర్లు బియ్యం అప్పగించాలని, ఇందుకోసం ఎఫ్‌సీఐ అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, డీఐఈఓ రవిబాబు, డీఈఓ సోమశేఖరశర్మ, డీటీఓ సత్యనారాయణ, ఏసీపీ ప్రసన్నకుమార్, డీసీఎస్‌ఓ చందన్‌కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ఖమ్మం దివ్యాంగుల కాలనీకి చెందిన బత్తుల వినయ్ డబుల్ బెడ్‌రూం కేటాయించాలని కోరారు.
- చింతకాని మండలం పాతర్లపాడుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఉప సర్పంచ్ తేలుకుంట్ల వెంకటశ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు.
- ప్రభుత్వం గతంలో తమకు ఇచ్చిన భూమిని ఆక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఖమ్మం బీ.కే.బజార్‌కు చెందిన పాలకుర్తి కృష్ణ – జ్యోతి కోరారు.

మరో అవకాశం !

- రేషన్ ఈ–కేవైసీ గడువు పొడిగింపు
- వచ్చేనెలాఖరు వరకు ప్రక్రియ
- జిల్లాలో ఇప్పటివరకు 74శాతమే పూర్తి
- పలుచోట్ల వేధిస్తున్న సాంకేతిక సమస్యలు

ఖమ్మం సహకారనగర్: రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈ–కేవైసీ చేయించుకునే గడువును ఫిబ్రవరి 29వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో విధించిన గడువు బుధవారం ముగియనుండగా.. చాలా మంది ఈ–కేవైసీ చేయించుకోనట్లు గుర్తించి మరింత సమయం ఇచ్చారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 748రేషన్ దుకాణాలు ఉండగా 4,11,906 కార్డులకు గాను 11,36,226మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు 8,48,289మంది(74.88శాతం) మాత్రమే ఈ–కేవైసీ చేయించుకున్నారని అధికారులు చెబుతున్నారు.

చివరి అవకాశంగా...

రేషన్ లబ్ధిదారులు ఈ–కేవైసీ చేయించుకునే ప్రక్రియను ఆరు నెలల క్రితం మొదలుపెట్టారు. ప్రధానంగా కార్డులపై పేర్లు ఉన్న వారిలో ఎవరైనా చనిపోతే గుర్తించేందుకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ–కేవైసీ చేయిస్తే కార్డుదారులు ఎంత మంది, ఎంత బియ్యం కేటాయించాలో స్పష్టమైన వివరాలు తెలుస్తాయని ప్రభుత్వం రంగంలోకి దిగింది. కానీ తొలినాళ్లలో ఎవరూ ఆసక్తి చూపించలేదు. గడువు సమీపిస్తున్న కొద్దీ లబ్ధిదారులు రేషన్ షాపులకు పరుగులు తీస్తున్నారు. జనవరి నెలాఖరు వరకే గడువు ఉందని ప్రభుత్వం ప్రకటించగా ఎక్కువ మంది డిసెంబర్, జనవరి నెలల్లోనే ఈ–కేవైసీ చేయించుకున్నారు. అయినప్పటికీ జిల్లాలో వంద శాతం ప్రక్రియ కాలేదు. ఇతర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉండడంతోకి ప్రభుత్వం ఫిబ్రవరి 29వ తేదీ వరకు అవకాశం కల్పించింది.



పలుమార్లు సమావేశాలు

ఈ–కేవైసీపై ప్రజలు ఆసక్తి చూపడం లేదని గుర్తించిన జిల్లా యంత్రాంగం పలుమార్లు రేషన్ దుకాణాల సంఘం బాధ్యులు, డీలర్లతో సమావేశాలు నిర్వహించింది. ప్రతీ లబ్ధిదారుడి ఈ–కేవైసీ పూర్తిచేయాలని సూచించగా... వారు సైతం అవగాహన కల్పించారు. దీంతో గత రెండు నెలుగా ప్రక్రియలో వేగం పెరిగినా మొత్తం మాత్రం పూర్తికాలేదు.

వేధిస్తున్న సాంకేతిక సమస్యలు

రేషన్ షాప్‌లకు లబ్ధిదారులు వెళ్లినా చాలా మంది వేలిముద్రలను యంత్రాలు గుర్తించడం లేదు. వయస్సు తక్కువగా ఉన్నప్పుడు ఆధార్ తీసుకునే క్రమంలో వేలిముద్రలు వేయడం వల్ల ఈ సమస్య ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాక వృద్ధుల వేలిముద్రలు కూడా నమోదు కావడం లేదని రేషన్ డీలర్లు చెబుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఐరిష్ ద్వారా ఈ–కేవైసీ చేయించాలని నిర్ణయించినా అన్ని షాపుల్లో ఆ సౌకర్యం లేదు. అలాగే, సిగ్నల్ సమస్యతోనూ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఇకనైనా వంద శాతం ఈ–కేవైసీ పూర్తికావాలంటే అధికారులు ఈ సమస్యలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఎక్కడైనా చేయించుకోవచ్చు....



రేషన్‌కార్డులపై పేరు ఉన్న ప్రతీఒక్కరు ఫిబ్రవరి 29వ తేదీలోగా ఈ–కేవైసీ చేయించుకోవాలి. దీన్ని తప్పనిసరి ప్రక్రియగా భావించాలి. ఈ విషయమై లబ్ధిదారులకు అవగాహన కల్పించేలా డీలర్లకు సూచనలు చేస్తున్నాం. ఏ రేషన్ దుకాణానికైనా లబ్ధిదారులు వెళ్లి ప్రక్రియ పూర్తిచేయొచ్చు.

– కె.చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

స్వచ్ఛమైన తాగునీటితో వ్యాధులు దూరం



నీరు తాగుతున్న కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు తాగునీటి స్వచ్ఛతపై అవగాహన పెంచుకుని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన తాగునీటి స్వచ్ఛతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించి మాట్లాడారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు సురక్షితమైనదని.. ఈ నీటినే ఉద్యోగులు తాగుతూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు కూడా లాభాలను వివరించాలని సూచించారు.

క్లుప్తంగా

సెమీఫైనల్స్‌కు చేరిన క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ స్మారక క్రికెట్ టోర్నీ సెమీఫైనల్ దశకు చేరింది. ఈమేరకు సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో ఖమ్మం అర్బన్, వీ.ఎం బంజర, సత్తుపల్లి, తల్లాడ జట్లు నెగ్గి సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. కాగా, మ్యాచ్‌లను కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొత్త సీతారాములు ప్రారంభించగా, టోర్నీ నిర్వాహకులు ఎం.డీ.మతిన్, వేణు, సూర్యం, రామారావు, వరప్రసాద్, నరేష్, వెంకట్, సలీం తదితరులు పాల్గొన్నారు.

‘పగడాల’ను కలిసిన ఎమ్మెల్సీ మధు

ఖమ్మంరూరల్: ప్రభుత్వ స్థలం ఆక్రమణ కేసుకు సంబంధించి జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజును ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ సోమవారం కలిశారు. అనంతరం జైలు గేట్ వద్ద మధు మాట్లాడుతూ కక్ష సాధింపు రాజకీయాల్లో భాగంగానే నాగరాజుపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించిందని ఆరోపించారు. ఇలాంటి వాటికి ఉద్యమాల నుండి పుట్టిన బీఆర్ఎస్ నాయకులు భయపడేది లేదని తెలిపారు. కాగా, ఇప్పుడు కేవలం నాగరాజుకు ధైర్యం చెప్పడానికే జైలుకు వచ్చానని... మిగతా అన్ని విషయాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు బెల్లం వేణు, గుండాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫిజీషియన్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు శోభన్‌కుమార్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా జనరల్ ఫిజీషియన్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ డీవీసీ.శోభన్‌కుమార్, కొల్లి అనుదీప్, సహాయ కార్యదర్శిగా రావెళ్ల రంజిత్‌తో పాటు మరో ఎనిమిది మందితో కమిటీ ఎన్నికైంది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఫిజీషియన్ల మహాసభలను ఖమ్మంలో నిర్వహించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొనగా సీనియర్ వైద్యులు కె.శివరామకృష్ణ, హన్మంతరావు, కృష్ణ సుమంత్, నారాయణమూర్తి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ విధానాలను ఎండగడదాం

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: కార్మిక హక్కులను కాలరాస్తున్న నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వ విధానాలను ఎండగట్టాల్సిన అవసరముందని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ మాజీ జాతీయ నాయకుడు పోటు ప్రసాద్ తెలిపారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసంఘటిత కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. ఏళ్లుగా పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేయడం ద్వారా హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. కాగా, బూర్జువా పార్టీలు తమ రాజకీయ గుర్తింపు కోసం మాత్రమే పని చేస్తున్నాయే తప్ప కార్మికుల హక్కుల కోసం పోరాడడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని వివిధ అడ్డాలకు చెందిన ఆటో కార్మికులు పలువురు ఏఐటీయూసీలో చేరారు. నాయకులు జానీమియా, శింగు నర్సింహారావు, మేకల శ్రీనివాసరావు, రావి రామకృష్ణ, గాదే లక్ష్మీనారాయణ, ఎస్.కే.సైదా తదితరులు పాల్గొన్నారు.

భర్త వద్దకు వెళ్తున్నానంటూ అదృశ్యం

కల్లూరు: మండలంలోని హనుమాతండాకు చెందిన ఓ వివాహిత కానరాకుండా పోయిన ఘటనపై కల్లూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన వివాహిత విజయవాడలో ఉన్న తన భర్త వద్దకు వెళుతున్నానని చెప్పి ఈనెల 20వ తేదీన బయలుదేరింది. అయితే, ఆమె భర్త వద్దకు చేరలేదని తెలిసిన కుటుంబీకులు ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ షాకీర్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,300	7,300
కందులు	8,999	8,999
బొబ్బెర్లు	7,700	7,700
మిర్చి	21,300	14,000
మిర్చి తాలు	12,000	8,000
పత్తి	6,650	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,448

ఊరించి.. ఉసూరుమనిపించి..

ఏకగ్రీవ పంచాయతీల నగదు ప్రోత్సాహకాలకు ప్రభుత్వం ఎగనామం పెట్టింది. అదిగో.. ఇదిగో అంటూ ఐదేళ్ల కాలం గడిపింది. గ్రామాల అభివృద్ధికి నిధులు ఉపయోగపడతాయని ఎన్నికలకు వెళ్లకుండా పాలక వర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే చివరకు నిరాశే మిగిలిందని సర్పంచ్‌లు, వార్డు సభ్యులు వాపోతున్నారు. పాలకవర్గాల పదవీకాలం మరో రెండు రోజుల్లో ముగియనుండగా, నగదు ప్రోత్సాహకాలపై సర్పంచ్ ఆశలు వదులుకున్నారు. – చుంచుపల్లి



బోధనెల్లి గ్రామ పంచాయతీ కార్యలయం

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం మొండిచేయి

- రెండు రోజుల్లో ముగియనున్న పాలకవర్గాల పదవీకాలం
- ఐదేళ్లుగా అందని నగదు ప్రోత్సాహకాలు
- ఉమ్మడి జిల్లాలో 116 ఏకగ్రీవ పంచాయతీలు

భద్రాద్రిలో ఏకగ్రీవ పంచాయతీలివే..

అశ్వాపురం మండలంలో నెల్లిపాక, చర్లలో పెద్దిపల్లి, కుర్నపల్లి, బోధనెల్లి, దుమ్ముగూడెం మండలంలో కొత్తపల్లి, కోయ నరసాపురం, అచ్చుతాపురం, పెద్ద కమలాపురం, దబ్బనూతల, మణుగూరులో బుగ్గ, ములకలపల్లిలో రామచంద్రపురం, పాత గుండాలపాడు, పాల్వంచ మండలంలో బంజర, చంద్రాలగూడెం, సత్యనారాయణపురం, సోములగూడెం, బిక్కుతండా, చంద్రుగొండలో దామరచర్ల, చంద్రుగొండ, దమ్మపేట మండలంలో అల్లిపల్లి, అకినేపల్లి, మందలపల్లి, పూసుకుంట, వడ్లగూడెం, గండుగులపల్లి, సీతారాంపురం, గణేష్‌పాడు, అశ్వారావుపేటలో అచ్యుతాపురం, మొద్దులమాడ, పినపాక మండలంలో భూపాలపట్నం, సీతంపేట, పాత రెడ్డిపాలెం, కరకగూడెంలో కొత్తగూడెం, సమత్ మోతే, ఆళ్లపల్లిలో దొంగతోగు, అడవి రామవరం, గుండాలలో దామరతోగు, టేకులపల్లి మండలంలో మద్రాస్‌తండా, సుక్కాల బోడు, యర్రగూడెం, పెట్రాంచెలక, లక్ష్మీదేవిపల్లి మండలంలో గడ్డిగుట్ట, రేగళ్ల గ్రామ పంచాయతీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఖమ్మం జిల్లాలో..

చింతకాని మండలంలోని రాఘవాపురం, ఏన్కూరు మండలం జన్నారం, పీకే బంజర, రాయమాధారం, సూర్యతండా, ఎర్రబోడుతండా, కల్లూరు మండలం కొర్లగూడెం, లింగాల, తూర్పులోకారం, నారాయణపురం, ఓబులురావుబంజర, పాయపూర్, పెద్దకోరుకొండి, పుల్లయ్యబంజర, కామేపల్లి మండలం కొత్తలింగాల, లాల్యాతండా, ముచ్చర్ల, పెద్దలింగాల, రుక్కితండా, తాళ్లగూడెం, ఖమ్మంరూరల్ మండలం తెల్దారుపల్లి, కొణిజర్ల మండలం లింగగూడెం, మల్లుపల్లి, మేకలకుంట, ఉప్పలచలక, కూసుమంచి మండలం ధర్మాతండా, గోరీలపాడుతండా, కొత్తూరు, మధిర మండలం అల్లీపురం, కంభంపాడు, రామకృష్ణాపురం, ముదిగొండ మండలం గోకినపల్లి, మేడేపల్లి, నేలకొండపల్లి మండలం శంకరగిరితండా, తిరుమలాపురంతండా, పెనుబల్లి మండలం భవన్నపాలెం, కొత్త లంకపల్లి, లంకపల్లి, పార్థసారధిపురం, రామకృష్ణాపురం, టేకులపల్లి, రఘునాథపాలెం మండలం జీకే బంజర, బాల్యాతండా, దొనబండ, హరియాతండా, కొర్లబోడుతండా, కోయచలక, లచ్చిరాంతండా,మంగ్యాతండా, ఎన్వీ బంజర, పుతానితండా, రాములుతండా, శివాయిగూడెం, సత్తుపల్లి మండలం గంగారం, గౌరిగూడెం, రామగోవిందాపురం, సదాశివపాలెం, తాళ్లమడ, సింగరేణి మండలం కొత్తతండా, పాతకమలాపురం, టేకులగూడెం, తల్లాడ మండలం మల్సూర్‌తండా, తిరుమలాయపాలెం మండలం గోల్‌తండా, ఇస్లావత్ తండా, సోలిపురం, వేంసూరు మండలం భరణిపాడు, భీమవరం, చోడవరంతండా, వైరా మండలం లింగన్నపాలెం, నారపనేనిపల్లి, ఎర్రుపాలెం మండలం రాంపురం పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి.

రూ.10 లక్షలు ఇస్తామన్నారు..

గ్రామ పంచాయతీలో పోటీ లేకుండా పాలక వర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందజేస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2019 గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా గతంలో ఏకగ్రీవ పంచాయతీలకు ఇచ్చే రూ.7 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని రూ.10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చింది. అదనంగా ఎమ్మెల్యేల నిధుల నుంచి మరో రూ.5 లక్షలు కూడా చెల్లిస్తామని పేర్కొంది. మొత్తం రూ.15 లక్షలు వచ్చే అవకాశం ఉండటంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చనే ఉద్దేశంతో అనేక పంచాయతీలు ఏకగ్రీవం వైపు మొగ్గు చూపాయి. ఉమ్మడి జిల్లాలో 1,070 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 116 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఖమ్మం జిల్లాలో 589 గ్రామపంచాయతీలకు 73, భద్రాద్రి జిల్లాలో 481 గ్రామ పంచాయతీలకు 43 ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. వీటిలో అధికంగా కొత్తగా ఏర్పడిన పంచాయతీలే ఉండటం విశేషం. ప్రభుత్వం ఇచ్చే నగదు ప్రోత్సాహకాలతో పంచాచాయతీలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని పాలకవర్గాలు భావించగా, ప్రభుత్వం మొండిచేయి చూపడంతో సర్పంచులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

ఉపాధ్యాయుల మూకుమ్మడి సెలవు

పాఠాలు జరగడం లేదని తల్లిదండ్రుల ఫిర్యాదు

కారేపల్లి: మండలంలోని పాటిమీదిగుంపు ప్రాథమికోన్నత పాఠశాలలోని నలుగురిలో ముగ్గురు ఉపాధ్యాయులు సోమవారం గైర్హాజరయ్యారని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా కారేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. పాఠశాలలో 82మంది విద్యార్థులు ఉండగా నలుగురు ఉపాధ్యాయులెవరూ హాజరుకాకవడంతో తరగతులు జరగడం లేదని తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు అందిందని తెలిపారు. దీంతో సీఆర్‌పీ సురేష్ ద్వారా వివరాలు సేకరించినట్లు చెప్పారు. కాగా, ఉపాధ్యాయులు వాట్సప్‌లో పెట్టి సెలవు మంజూరు కాకున్నా విధులకు హాజరుకావడం లేదని తేలిందన్నారు. ఈ విషయమై కలెక్టర్, డీఈఓకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ మేరకు ఎంఈఓ జయరాజును వివరణ కోరగా ముగ్గురు ఉపాధ్యాయులు సెలవు పెట్టగా, మరో ఉపాధ్యాయుడూ అత్యవసరంగా ఉదయం పూట సెలవు కోరడంతో ఇవ్వాల్సి వచ్చిందన్నారు. అనంతరం మరో ఉపాధ్యాయుణ్ణి సంబంధిత పాఠశాలకు పంపించామని తెలిపారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ

వరంగల్ నిట్ ప్రొఫెసర్ దినకర్



పరిశోధనాపత్రాలు ఆవిష్కరిస్తున్న దినకర్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: అనాదిగా మనిషి మనుగడకు సైన్స్ దోహదపడుతోందని వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ దంతాల దినకర్ పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యాన నిర్వహించే రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభం కాగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ‘మెటీరియల్ సైన్స్ – మెడికల్ అప్లికేషన్స్’పై దినకర్ మాట్లాడుతూ మానవ మనుగడలో ప్రతీ అంశం సైన్స్‌కు ముడిపడి ఉందని తెలిపారు. ఆతర్వాత ప్రొఫెసర్ హరనాథ్ ‘బయో ఇన్‌స్పైర్, మెటీరియల్ అండ్ డివైజెస్ ఫర్ బెటర్ లివింగ్’ అంశంపై కీలకోపన్యాసం చేయగా, విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.ప్రభాకర్‌రావు కూడా మాట్లాడారు. ప్రిన్సిపాల్ పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కన్వీనర్ డాక్టర్ ఆర్. ప్రవీణ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్



కలెక్టర్‌ను సత్కరిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం: డీసీఎంఎస్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కొత్వాల శ్రీనివాస రావు సోమవారం కలెక్టర్ వీపీ.గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. పాల్వంచ జెడ్పీటీసీ సభ్యుడు యర్రంశెట్టి ముత్తయ్య తదితరులు ఆయన వెంట ఉన్నారు.

నేడు వీ.వీ.పాలెం సొసైటీ అవిశ్వాసంపై కోర్టు తీర్పు

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్ కూరాకుల నాగభూషణంపై డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి మంగళవారం కోర్టు తీర్పు వెలువరించనుంది. సొసైటీ కార్యాలయంలో శనివారం అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించినప్పటికీ కోర్టు ఆదేశాలతో అధికారులు ఫలితాన్ని వెల్లడించలేదు. ఈ మేరకు మంగళవారం కోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా అధికారులు ఫలితం వెల్లడించే అవకాశముంది. అయితే, అవిశ్వాస తీర్మానం సమావేశానికి హాజరైన 11మంది డైరెక్టర్లు మాత్రం తాము చైర్మన్‌కు వ్యతిరేకంగా చేతులెత్తామని అదే రోజు ప్రకటించారు.

అంతరాలు లేని విద్య ప్రజల హక్కు

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్

ఖమ్మంసహకారనగర్: అంతరాలు లేని విద్య అందుకోవడం ప్రజలందరి హక్కు అని, ఈ బాధ్యతను ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ అన్నారు. ఖమ్మం నయాబజార్ హైస్కూల్‌లో సోమవారం జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘అంతరాలు లేని విద్య ప్రజల హక్కు – ప్రభుత్వ బాధ్యత’ ప్రధానాంశంగా వచ్చే నెల 11, 12వ తేదీల్లో నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా, ప్రభుత్వ పాఠశాలలను పాలకులు నిర్వీర్యం చేసి, కులానికో గురుకులాన్ని ప్రారంభించారన్నారు. తద్వారా ప్రభుత్వ విద్యను విభజించగా విద్యార్థుల్లో అంతరాలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. సమావేశంలో ఆహ్వాన సంఘం సహాధ్యక్షుడు వి.మనోహర్‌రాజు, రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు పి.నాగిరెడ్డి, ఎస్.విజయ్, విద్యా పరిరక్షణ కమిటీ గౌరవాధ్యక్షుడు ఆళ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీసంఘాల సమావేశం

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా ప్రజాపరిషత్‌లోని అన్ని స్థాయీ సంఘాల సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు సీఈఓ వీ.వీ.అప్పారావు తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

విజయ డెయిరీ ఖమ్మం డీడీగా ధన్‌రాజ్



ధన్‌రాజ్

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ(విజయ డయిరీ) డిప్యూటీ డైరెక్టర్‌గా జి.ధన్‌రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టెం లక్ష్మి ఉత్తర్వులు జారీ చేయగా, సోమవారం ఆయన ఖమ్మంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో డీడీగా డాక్టర్ అసోడా కుమారస్వామిని ఏడాది కాల పరిమితితో నియమించారు. ఆ సమయం పూర్తికావటంతో జనగామలో డీడీగా ఉన్న ధన్‌రాజ్‌ను నియమించడంతో ఆయన కుమారస్వామి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు బి.వెంకటయ్య, శ్రీనివాసరావు, బసవయ్య, రామయ్య, నాగేశ్వరరావు, మధనమ్మ, ఉషారాణి తదితరులతో పాటు కార్యాలయ అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దాస్పత్రికి పోటెత్తిన జనం..



గైనకాలజీ ఓపీ వద్ద వేచి ఉన్న గర్భిణులు, (ఇన్‌సెట్) ఓపీ చీటీ రాయించుకునేందుకు బారులు...

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సోమవారం కిటకిటలాడింది. జనరల్, ఎంసీహెచ్ విభాగాల్లో పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల వారు, వారి బంధువులతో రద్దీ నెలకొంది. వరుస సెలవులు రావడం ఉదయం 8 గంటల నుంచే తాకిడి మొదలుకాగా.. ఓపీ చీటీ రాయించుకుని పరీక్ష చేయించుకునేందుకు చాలా సమయం పట్టింది. దీంతో వృద్ధులు, గర్భిణులు అవస్థ పడగా అధికారులు త్వరత్వరగా పరీక్షలు పూర్తయ్యేలా పర్యవేక్షించారు.

10 క్వింటాళ్ల మిర్చి చోరీ

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడులో ఓ రైతుకు చెందిన కల్లం నుంచి మిర్చి ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన రైతు పుసులూరి సురేష్ పది క్వింటాల మిర్చి ఆదివారం రాత్రి కల్లం నుంచి ఎత్తుకెళ్లారు. ఘటనపై సోమవారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారానికి చెందిన ఓ యువకుడు కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన ఎం.సురేష్ అనే యువకుడు సోమవారం కలుపు మందు తాగగా, కాసేపటికి గుర్తించిన కుటుంబ సభ్యులు నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. కాగా, సురేష్ ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

రూ.6లక్షల విలువైన గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని రెండు ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసులు సోమవారం చేపట్టిన తని ఖీల్లో రూ.6లక్షల పైగా విలు వైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–2 సీఐ రాజిరెడ్డి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా కర్ణాటక ప్రాంతానికి చెందిన అశోక్‌తో పాటు ఔరంగాబాద్‌కు చెందిన ముగ్గురు మహిళలు కాల్వొడ్డు ప్రాంతంలోని రెండు చోట్ల పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.6లక్షలకు పైగా విలువైన 27కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సైలు సరిత, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చేనుకు అమర్చిన తీగలను తాకడంతో ఘటన

తిరుమలాయపాలెం: జొన్న చేనుకు అమర్చిన విద్యుత్ తీగలను ప్రమాదవశాత్తు తాకిన ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తిరుమలాయపాలెం మండలం హైదర్‌సాయిపేటకు చెందిన లునావత్ వెంకన్న తాను వేసిన జొన్న చేనును కోతుల నుంచి రక్షించుకునేందుకు విద్యుత్ తీగలు అమర్చాడు. ఖమ్మంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే ఎస్.కే.యాకూబ్‌పాషా(26) గ్రామంలో ఉర్సు ఉత్సవాలకు హాజరై రెండు రోజులుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. సోమవారం తమ వరి పొలానికి మందు కొట్టించేందుకు వెళ్లిన ఆయన బిందె కోసం మొక్కజొన్న చేను గెట్టు వైపు వెళ్లగా విద్యుత్ తీగలను గమనించక తాకడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే కుప్పకూలాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పగికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, ఘటనకు బాధ్యుడైన వెంకన్నపై చర్యలు తీసుకుని తమ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలంటూ యాకూబ్ బంధువులు ఆందోళన చేశారు. అయితే, మొక్కజొన్న చేను యజమాని వెంకన్న పరారీలో ఉండగా, గ్రామంలో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా, యాకూబ్‌పాషాకకు భార్య, కుమారుడు ఉండగా, ప్రస్తుతం ఆమె గర్భవతి కావడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గంజాయి, గంజాయి చాక్లెట్లు..

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్ మీదుగా అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది కేజీల గంజాయి, మూడు కేజీల గంజాయి చాక్లెట్లను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన రాఖీ గణేష్ చౌహాన్, బాలి వసంత్ సాలుంకే గంజాయిని తరలిస్తున్నారనే సమాచారంతో డీటీఎఫ్ సీఐ విజయేందర్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వీరి నుంచి గంజాయితో పాటు గంజాయి చాకెట్లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా...



అధునాతన ప్రభుత్వ పాఠశాలను
చూసి ఆశ్చర్యపోయా
ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్

సాక్షి, అమరావతి: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రముఖ సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ (ట్విట్టర్) వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. సోమవారం ఆయన స్వగ్రామం బాపట్లకు సమీపంలోని కర్లపాలెం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, తరగతి గదుల్లో విద్యార్థుల బల్లలపై కూర్చుని, ఫొటోలు దిగి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. 'అందంగా, అధునాతనంగా మారిన కర్లపాలెం ప్రభుత్వ పాఠశాలను చూసి నాకు చాలా సంతోషంగాను, ఆశ్చర్యంగా అనిపిస్తోంది' అని ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సర్వీస్ నిబంధనపై హైకోర్టు స్టే

సాక్షి, హైదరాబాద్: సూపర్ స్పెషాలిటీ కోర్సులు పూర్తి చేసిన పీజీ విద్యార్థులు ఓ ఏడాది పాటు ప్రభుత్వ సర్వీస్ చేయాలని, అలా చేయకుంటే రూ.50 లక్షలు జరిమానా చెల్లించాలన్న సర్కార్ నిబంధనపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. ఈ మేరకు మధ్యంతర ఆదేశాలిచ్చింది. అలాగే ప్రభుత్వ సర్వీసు నిమిత్తం కేటాయించిన సంబంధిత కాలేజీల్లో చేరాలంటూ వైద్యవిద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను కూడా నిలిపివేసింది. సూపర్ స్పెషాలిటీ కోర్సు పూర్తి చేసిన వారు ప్రభుత్వ సర్వీసు చేయాలని, లేని పక్షంలో రూ. 50 లక్షలు జరిమానా చెల్లించాలని... ఈ మేరకు అంగీకారం తెలుపుతూ బాండ్ సమర్పించాలన్న నిబంధనను సవాలు చేస్తూ డాక్టర్ అన్వేష్‌కుమార్‌రెడ్డి మరో 22 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్వీ శ్రావణ్ కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పై రెండు అంశాలపై స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు పిటిషనర్లకు మాత్రమే వర్తిస్తాయన్నారు. దీనిపై కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 14కు వాయిదా వేశారు.

ఏపీ స్కూళ్లలో పెరిగిన చేరికలు

టాప్-4 రాష్ట్రాల్లో ఏపీకి తొలిస్థానం
- సంస్కరణలతో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, ఎలిమెంటరీ స్కూళ్ల స్థాయిలో భారీ పెరుగుదల
- జాతీయ స్థాయిని మించి ఏపీలో స్థూల నమోదు నిష్పత్తి పెరుగుదల
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: విద్యా రంగంలో ఏపీ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. 2021 విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి (పిల్లలు చేరికలు)లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉండడమే ఇందుకు నిదర్శనం. ఈ విషయాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. 2017తో పోలిస్తే 2021లో దేశంలోని స్థూల నమోదు నిష్పత్తి పెరిగిన టాప్– రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తొలిస్థానంలో ఉందని ఆ నివేదిక తెలిపింది. అలాగే, 2021లో జాతీయ స్థూల నమోదును మించి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధిక స్థూల నమోదు ఉందని కూడా పేర్కొంది. 2017తో పోలిస్తే.. 2021లో రాష్ట్రంలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, ఎలిమెంటరీ స్థాయిలో స్థూల నమోదు నిష్పత్తి భారీగా పెరిగిందని కూడా నివేదిక తెలిపింది.


'అమ్మఒడి' ప్రోత్సాహంతోనే..

స్థూల నమోదు నిష్పత్తిలో టాప్ నాలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తరువాత ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ ఉండగా.. స్థూల నమోదు 2017తో పోలిస్తే 2021లో తగ్గిన నాలుగు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, గోవా, జార్ఖండ్, బిహార్ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2017తో పోలిస్తే 2021లో ప్రైమరీలో 18.4 శాతం, అప్పర్ ప్రైమరీలో 13.4 శాతం, ఎలిమెంటరీలో 16.5 శాతం స్థూల నమోదు పెరిగినట్లు నివేదిక తెలిపింది. ఇందుకు ప్రధాన కారణం బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా.. అన్ని వర్గాల్లోని పేదల తల్లిదండ్రులకు తమ పిల్లల చదువులు భారం కాకూడదనే దూరదృష్టితో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న అమ్మఒడి పథకం అమలుచేస్తోంది. ఈ పథకం అమలు ద్వారా పేద వర్గాల పిల్లలందరూ స్కూళ్లలో చేరేలా ప్రోత్సాహం అందిస్తోంది. జగనన్న అమ్మఒడి ద్వారా పిల్లలను స్కూళ్లకు పంపితే ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. దీంతో అన్ని వర్గాల్లోని పేదలు తమ పిల్లలను స్కూళ్లకు పంపుతున్నారు.

స్థూల నమోదు వృద్ధికి దోహదపడిన సంస్కరణలు..

- మనబడి నాడు–నేడు ద్వారా తొలి దశలో.. 15 వేలకు పైగా ప్రభుత్వ స్కూళ్లలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారు.
- రెండో దశలో మరో 22,221 స్కూళ్ల రూపురేఖలను మార్చే పనులు చేపట్టారు.
- దీంతోపాటు.. పిల్లలు మధ్యలో చదువు మానేయకుండా గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా చర్యలను తీసుకుంటోంది. ఇందులో భాగంగా.. పిల్లలు ఎవరైనా స్కూళ్లకు వెళ్లకపోతే వలంటీర్లు ఆ పిల్లల తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి కారణాలు తెలుసుకుని తిరిగి స్కూళ్లకు వచ్చేలా ప్రభుత్వం చర్యలను తీసుకుంది.
- స్కూళ్లకు వచ్చే పిల్లలకు జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోంది.
- పేద పిల్లల చదువులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాం, బూట్లు తల్లిదండ్రులపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే జగనన్న విద్యా కానుక ద్వారా ఉచితంగా కిట్‌ను అందిస్తోంది.
- ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంను కూడా అమలుచేస్తోంది. పిల్లలకు ట్యాబులను కూడా అందిస్తోంది. ఈ చర్యలన్నీ కూడా పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి పెరగడానికి దోహదం చేశాయి.

రాజ్యసభ 3 స్థానాలూ వైఎస్సార్‌సీపీకే..



సాక్షి, అమరావతి: ఏపీలో వచ్చే ఏప్రిల్ 2న ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాలూ వైఎస్సార్‌సీపీకే దక్కనున్నాయి. గతంలో రాష్ట్ర కోటాలో రాజ్యసభకు ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ), సీఎం రమేష్ (బీజేపీ)ల పదవీకాలం ఏప్రిల్ 2తో పూర్తికానుంది. వీటికి ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహిస్తారు. ప్రస్తుతం శాసనసభలో ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే ఈ మూడు రాజ్యసభ స్థానాలూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి చేరడం ఖాయం. దీంతో రాష్ట్ర కోటాలో మొత్తం 11 స్థానాలూ వైఎస్సార్‌సీపీ పరమవుతాయి. అంటే.. ఏప్రిల్ 2 తర్వాత రాజ్యసభలో టీడీపీ ఉనికే లేకుండాపోతోంది. ఆ పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకూ 41 ఏళ్లలో రాజ్యసభలో టీడీపీకి ప్రాతినిధ్యం లేకుండా పోవడం ఇదే ప్రథమం అవుతుంది. ఇక రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 250 లోపు ఉండాలి. ప్రస్తుతం ఆ సభ్యుల సంఖ్య 245. ఇందులో 233 మందిని దేశంలోని రాష్ట్రాల ఎమ్మెల్యేలు ఎన్నుకుంటారు. మిగతా 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. మన రాష్ట్ర కోటాలో రాజ్యసభ సభ్యుల సంఖ్య 11. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి ఇద్దరు.. టీడీపీకి 9 మంది సభ్యులు ఉండేవారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 151 స్థానాల్లో ఘన విజయం సాధించింది. టీడీపీ 23 స్థానాలకే పరిమితమైంది. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో సత్సంబంధాలు నెరిపి.. అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సుజనా చౌదరి, సీఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, టీజీ వెంకటేష్‌లను బీజేపీలోకి ఫిరాయించేలా చంద్రబాబు చక్రం తిప్పారు. రాష్ట్ర కోటాలో ఎన్నికై న రాజ్యసభ సభ్యుల్లో 2020లో నలుగురు (టీడీపీ), 2022లో నలుగురు (ముగ్గురు టీడీపీ, ఒకరు వైఎస్సార్‌సీపీ) పదవీ కాలం పూర్తవడంతో ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలం ఆధారంగా ఈ ఎనిమిది స్థానాలు వైఎస్సార్‌సీపీకే దక్కాయి. ఇందులో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి సీఎం జగన్ చాటిచెప్పారు.

దివ్యాంగుడికి 'గోవర్ధన' నిలయం

- దివ్యాంగుడికి ఇల్లు కట్టించి ఇచ్చిన మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- రూ.10 లక్షల సొంత డబ్బు వెచ్చించి



గంప గోవర్ధన్ కట్టించి ఇచ్చిన ఇల్లు



కామారెడ్డి క్రైం: నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరిగే ప్రధాన రహదారిలో.. కామారెడ్డి మున్సిపల్ పరిధి పాత రాజంపేటలోని రైల్వే గేటు పక్కనే ఓ చిన్న పూరి గుడిసె ఉండేది. వర్షం పడినప్పుడల్లా ఇళ్లంతా కురవడంతో నీరు చేరి అందులోని ఓ దివ్యాంగుడు, కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆ రోడ్డు మీదుగా వెళ్తున్నప్పుడల్లా వారి అవస్థలను మాజీ ఎమ్మెల్యే, అప్పటి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గమనించేవారు. ఈ క్రమంలో 8 నెలల క్రితం గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరైన గంప గోవర్ధన్ వద్దకు రెండు కాళ్లులేని దివ్యాంగుడు షేక్ ఖాదర్ వెళ్లి తన గోడును వెళ్లబోసుకున్నాడు. వెంటనే స్పందించిన గోవర్ధన్ మీ అవస్థలను గమనించానని, మీకు సొంతిల్లు కట్టిస్తానని మాట ఇచ్చారు. వెంటనే రూ.10 లక్షలు తన సొంత డబ్బును వెచ్చించి 80 గజాల విస్తీర్ణంలో హాలు, కిచెన్, బెడ్‌రూం, ఇతర అన్ని సౌకర్యాలతో నిర్మాణం పూర్తయిన ఆ పక్కా ఇంటిని గోవర్ధన్ ఆదివారం ప్రారంభించారు. సొంత డబ్బుతో ఇంటిని నిర్మించి ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఔదార్యంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది..: గంప గోవర్ధన్

రైల్వే గేటు సమీపంలోని గుడిసెలోకి వర్షం నీరుచేరి దివ్యాంగుడు ఖాదర్, కుటుంబం ఇబ్బంది పడటం చాలా సార్లు గమనించాను. అతనికి ఏదైనా సహాయం చేయాలనుకున్నా. మరో చోట ఇల్లు కట్టిస్తానంటే వద్దన్నాడు. దాంతో గుడిసె ఉన్న స్థలంలోనే సొంత డబ్బుతో ఇల్లు నిర్మించి ఇచ్చాను. ఓ దివ్యాంగుడికి సహాయపడినందుకు సంతృప్తిగా, సంతోషంగా ఉంది.

నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్‌బాబు

బోధన్: మూతపడిన నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య ఉన్నత శాఖాధికారులు 10 మందితో కమిటీ వేసింది. కమిటీ చైర్మన్‌గా పరిశ్రమలు, ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కో చైర్మన్‌గా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, సభ్యులుగా ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి, పరిశ్రమల, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ షుగర్ అండ్ కేన్ కమిషనర్ కమిటీలో ఉన్నారు. ఈనెల 12న కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 4ను జారీ చేసింది. బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని 1938లో నిజాం హయాంలో నెలకొల్పారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా షుగర్ ఫ్యాక్టరీల విస్తరణకు దోహదపడింది. 2002లో చంద్రబాబు హయాంలో బోధన్, ముత్యంపేట (జగిత్యాల), ముంబోజిపల్లి (మెదక్) ఫ్యాక్టరీలను ప్రైవేట్ చేశారు. దీంతో నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) రూపాంతరం చెందింది.

రెండు దరఖాస్తులు చాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఎండీ, డీఎన్‌బీ ఇలా 67,802 పీజీ మెడికల్ సీట్లున్నాయి. జాతీయ, రాష్ట్రస్థాయి రెండింటిలోనూ సీట్లను నీట్ ప్రవేశపరీక్ష ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేస్తారు. ప్రస్తుతం ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం అఖిల భారత ర్యాంకు ఆధారంగా మెరిట్ జాబితాను తయారు చేస్తున్నారు. అభ్యర్థులు తమ రాష్ట్ర పరిధిలో దరఖాస్తు చేసుకున్నప్పుడు.. వారిని రాష్ట్ర కేటగిరీగా గుర్తించి, తదనుగుణంగా మెరిట్ జాబితాలను తయారు చేసేవారు. కేంద్ర ప్రభుత్వం అన్ని మెడికల్ కాలేజీల్లోని 15 శాతం ఆలిండియా కోటా సీట్లకు, డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీ, ఏఎఫ్ఎంసీ, బీహెచ్‌యూ, ఏఎంయూ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహించేది. అభ్యర్థులెవరైనా ఈ 15 శాతం ఆలిండియా కోటా సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక రాష్ట్ర కోటా, రాష్ట్రాల పరిధిలోకి వచ్చే ఇతర సీట్లకోసం అభ్యర్థులు తమ సొంత రాష్ట్రాల్లోని కాలేజీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ అధికారులు కూడా.. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లోని సీట్లకు ఆలిండియా ర్యాంకుల ఆధారంగా మెరిట్ జాబితాలు తయారు చేసి అడ్మిషన్లు చేస్తారు.

ప్రైవేట్ సీట్లకూ జాతీయస్థాయి కౌన్సెలింగ్

ప్రస్తుతం రాష్ట్రాల్లోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లకు ఆయా రాష్ట్రాల్లోనే కౌన్సెలింగ్ జరుగుతోంది. వాటిలో కన్వీనర్ కోటాకు వేరుగా, బీ కేటగిరీ, ఎన్నారై కోటాల సీట్లకు వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వీటిలోని ఓపెన్ కేటగిరీ సీట్లకు దేశంలోని ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ కౌన్సెలింగ్ కోసం వేర్వేరుగా దరఖాస్తులు చేసుకోవాల్సి వస్తోంది. ఎన్ఎంసీ నిర్ణయం అమల్లోకి వస్తే.. ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు కాలేజీల్లోని వివిధ కేటగిరీల సీట్లకు ఒకే దరఖాస్తు సరిపోతుంది, ఒకేసారి కౌన్సెలింగ్ జరుగుతుంది.

- ఉదాహరణకు తెలంగాణలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఉన్న బీ కేటగిరీ సీట్లలో 85 శాతం స్థానికులకు కేటాయించగా, మిగతా 15 శాతం ఓపెన్ కేటగిరీ సీట్లకు దేశంలోని ఏ రాష్ట్రం వారైనా పోటీపడొచ్చు.

ఈ ఓపెన్ కేటగిరీ రిజర్వేషన్లు వివిధ రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నాయి. ఒకే దరఖాస్తు ద్వారా ఆయా రాష్ట్రాల్లోని కాలేజీల్లో ఎక్కడో ఒకచోట సీటు పొందవచ్చు. నచ్చినచోట చేరవచ్చని, లేకుంటే తదుపరి కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని ఎన్ఎంసీ అధికారులు చెప్తున్నారు.

- గత ఏడాది దేశవ్యాప్తంగా 20.87 లక్షల మంది నీట్ యూజీ పరీక్ష రాశారు. మొత్తం 11,45,976 మంది అర్హత సాధించగా.. అందులో ఏపీ నుంచి 42,836, తెలంగాణ నుంచి 42,654 మంది ఉన్నారు.

జిల్లా వార్తలు

ఘాటు రావొద్దని..



ఖమ్మం మార్కెట్ యార్డులో ట్యాంకర్‌తో నీరు చల్లుతున్న దృశ్యం

మిర్చిలో మిగతా రకాలతో పోలిస్తే 'తేజా' రకం ఎక్కువ ఘాటు ఉంటుంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించేది కూడా తేజా రకం మిర్చినే. ఈ మిర్చి ఘాటు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రస్తుతం మిర్చి విక్రయాలు పెరగటంతో మార్కెట్‌లో అధికార యంత్రాంగం నియంత్రణ చర్యలు చేపట్టింది. మార్కెట్ యార్డు, పరిసర ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటిని చల్లుతూ మిర్చి ఘాటు నుంచి కొంత మేరకు ఉపశమనం కలిగిస్తున్నారు. – ఖమ్మం వ్యవసాయం

ఆలయాలకు ధర్మకర్తల మండళ్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 19 దేవాలయాలకు నూతన కమిటీలు
- ఆదేశాలు జారీ చేసిన దేవాదాయ శాఖ కమిషనర్
- దరఖాస్తు చేసుకునేందుకు 20 రోజుల గడువు



చింతకానిలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు దేవాలయాలకు ధర్మకర్తల మండళ్ల నియామకానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ చర్యలు చేపట్టింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 84 దేవాలయాలు మండళ్ల నియామకానికి అర్హత కలిగి ఉండగా.. ఇందులో 19 ఆలయాలకు ప్రస్తుతం మండళ్లను నియమించనున్నారు. ఈ మేరకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని అధికారులను శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. రూ.5 లక్షలు, ఆపైన ఆదాయం కలిగిన ఆలయాలకు ఐదుగురితో, రూ.25 లక్షలు ఆపైన ఆదాయం కలిగిన ఆలయాలకు ఏడుగురితో కూడిన కమిటీలను నియమించాలని సూచించారు. కాగా, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు లేదా నిబంధనల ప్రకారం అర్హులైన వారు నోటిఫికేషన్ వెలువడిన ఇరవై రోజుల్లోగా ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్‌కు దరఖాస్తులు అందించాల్సి ఉంటుంది.

ఖమ్మం జిల్లాలో 12 ఆలయాలు

ఖమ్మం జిల్లాలో ధర్మకర్తల మండళ్లు నియమించనున్న ఆలయాల వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం సుగ్గలవారి తోటలోని శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి, ఎన్నెస్పీ క్యాంపులోని శ్రీ సీతారాంజనేయస్వామి, ఖమ్మం ధంసలాపురంలోని శ్రీ శంభులింగేశ్వరస్వామి, వైరా మండలం గొల్లపుడిలోని శ్రీ పులిగొండ లక్ష్మీనరసింహస్వామి, పల్లిపాడులోని శ్రీ శంభులింగేశ్వర స్వామి, ముదిగొండ మండలం చిరుమర్రిలోని శ్రీ రామలింగేశ్వరస్వామి, పెద్దమండవలోని శ్రీ రాజావేణుగోపాల స్వామి, వేంసూరు మండలం కుంచపర్తిలోని శ్రీ మారెమ్మ, వేంసూరు మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయాలకు ధర్మకర్తల మండళ్లను నియమిస్తారు. ఇంకా చింతకానిలోని శ్రీ చెన్నకేశవ స్వామి, కల్లూరులోని శ్రీశివుడు, ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లలోని శ్రీ సిద్ధి మల్లేశ్వర స్వామి దేవాలయాల నూతన ధర్మకర్తల మండళ్లకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరులోని నీలకంఠేశ్వర స్వామి, బూర్గంపాడు మండలం మోతెగడ్డలోని శ్రీవీరభద్రస్వామి, భద్రాచలంలోని శ్రీ కుసుమ హరనాథ బాబా, పాల్వంచ మండలంలోని నవనగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ దాసాంజనేయస్వామి దేవాలయాలతోపాటు పాల్వంచలోని శ్రీ రామాలయ భజన మందిరం, ఇల్లెందులోని శ్రీ హరిహర క్షేత్రాలకు నూతనంగా ధర్మకర్తల మండళ్ల నియామకానికి నోటిఫికేషన్లు విడుదల చేయాలని కమిషనర్ ఆదేశించారు.

గిరిజనులకు ప్రభుత్వ పథకాలు చేరాలి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



కంటి సమస్యను పీఓకు వివరిస్తున్న పూనెం భద్రమ్మ

భద్రాచలం: మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల వద్ద నుంచి వినతిపత్రాలు, పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులకు వాటిని అందజేసిన పీఓ సత్వరమే పరిశీలించి అర్హతల మేరకు వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. గిరిజనుల చెంతకు ప్రభుత్వ పథకాలు చేరేలా యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోడు భూములు సమస్యలు, రైతుబంధు రుణాలు, పోడు భూములకు పట్టాలు, వ్యవసాయానికి విద్యుత్ మోటార్లతో పాటు ట్రైకార్ సబ్సిడీ రుణాల కోసం ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, అధికారులు టి.వెంకటేశ్వరరాజు, సురేశ్‌బాబు, మునీర్‌పాషా, ఆర్.శ్రీనివాస్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్పటికప్పుడే ప్రభుత్వ ఆస్పత్రికి..

దుమ్ముగూడెం మండలం నడిగడ్డకు చెందిన పూనెం భద్రమ్మ తాను కంటి సమస్యతో బాధపడుతున్నట్లు గిరిజన దర్బార్‌లో పీఓకు విన్నవించింది. ఆమె సమస్యను తెలుసుకున్న పీఓ.. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఇటీవలే కంటి చికిత్సకు సంబంధించి ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించారని చెప్పి తన అధికార వాహనంలో ఆమెను ఆస్పత్రికి పంపించారు. దీంతో వైద్యులు ఆమెను పరీక్షించి ఫిబ్రవరి 2వ తేదీన శస్త్రచికిత్స చేస్తామని చెప్పడంతో భద్రమ్మ వైద్యులతో పాటు పీఓకు కృతజ్ఞతలు తెలిపింది.

'వృక్ష మిత్ర'లకు పూర్తయిన శిక్షణ



యంత్రాలు అందుకున్న వారితో డీన్ శ్రీనివాసరెడ్డి, తదితరులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏపీ కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యాన కొబ్బరిచెట్లు ఎక్కడంతోపాటు తెగుళ్లను గుర్తించే అంశాలపై కొబ్బరి వృక్ష మిత్రలుగా ఎంపిక చేసిన వారికి ఇచ్చిన శిక్షణ పూర్తయింది. అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో ఆరు రోజుల పాటు వారికి క్షేత్ర స్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చివరిరోజు వారికి కొబ్బరి చెట్లు సులువుగా ఎక్కేందుకు ఉపయోగపడే యంత్రాలను కళాశాల ఇన్‌చార్జ్ డీన్ డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. అలాగే, శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు, ధ్రువీకరణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు జయమ్మ, కె.నాగాంజలి, రమేష్, పావని, శిరీష, నీలిమ, మాస్టర్ ట్రెయినీలు పాల్గొన్నారు.

కలల కొలువు.. నిజమైన వేళ



- స్టాఫ్‌నర్స్‌లుగా ఉమ్మడి జిల్లా నుంచి 565 మంది
- రేపు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు
- వైద్యరంగంలో కొనసాగుతూనే ఎంపిక

వైద్యరంగంలో స్థిరపడాలన్న ఆకాంక్షకు అనుగుణంగా పట్టుదలతో చదివారు. అందుకు తగినట్లుగా జీఎన్ఎం పట్టా పొందారు. ప్రభుత్వ కొలువు కోసం సుదీర్ఘకాలంగా ఎదురు చూశారు. ఈ విషయంలో ఆలస్యమైనా నిరాశ చెందకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు విధానంపై లేదంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో కొనసాగుతూ వచ్చారు. ఇంతలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోగా... ప్రభుత్వం తాజాగా ఫలితాలు వెల్లడించింది. ఇందులో ఖమ్మం జిల్లా నుంచి 325మందికి, భద్రాద్రి జిల్లా నుంచి 240 మందికి అవకాశం దక్కింది. వీరికి హైదరాబాద్‌లో బుధవారం జరిగే సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందచేయనున్నారు. ఈమేరకు స్టాఫ్‌నర్స్‌లుగా ఎంపికైన పలువురి అభిప్రాయాలు ఇలాఉన్నాయి. – ఇల్లెందురూరల్

గ్రామంలో నేనే మొదటి ఉద్యోగిని..



మా గ్రామానికే చెందిన జర్పుల భద్రాజీతో నా వివాహం జరిగింది. నన్ను నా భర్త జీఎన్ఎం చదివించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూనే స్టాఫ్‌నర్స్ ఉద్యోగం సాధించా. కుటుంబ సహకారంతో మా గ్రామంలో తొలి ప్రభుత్వ ఉద్యోగినిగా నిలిచా.

– గుగులోత్ శ్రావణి, అమర్‌సింగ్ తండా, ఇల్లెందు మండలం

ఆకాంక్ష నెరవేరింది..



వైద్య రంగంలో స్థిరపడాలన్న నా ఆకాంక్షను కుటుంబీకులు ప్రోత్సహించారు. జీఎన్ఎం కోర్సు పూర్తిచేశాక కాంట్రాక్టు పద్ధతిపై గుండాల ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేశా. ఎట్టకేలకు స్టాఫ్‌నర్స్‌గా ప్రభుత్వ ఉద్యోగం రావడంతో నా కల నెరవేరింది.

– మోకాళ్ల స్వాతి, కొత్తూరు, ఇల్లెందు మండలం

వైరా మండలం నుంచి ...



గద్దం మౌనిక



కట్టా పార్వతి

వైరారూరల్: స్టాఫ్‌నర్సులుగా వైరా మండలంలోని గొల్లపూడి, తాటిపూడి గ్రామాలకు చెందిన గద్దం మౌనిక, కట్టా పార్వతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, కుటుంబ సభ్యులు వారిని అభినందించారు.

అన్నదమ్ముల ఎంపిక



ఆసిఫ్, హనీఫ్

వైరా: ఒకే ఇంటి నుంచి ఇద్దరు స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్లు(స్టాఫ్ నర్స్)గా ఎంపికయ్యారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామానికి చెందిన ఎల్ఐసీ అడ్వైజర్ ఎస్.కే.గౌస్‌మియా – మహబూబ్‌బీ దంపతుల కుమారులు హనీఫ్ పాషా, ఆసిఫ్‌పాషా రాష్ట్రప్రభుత్వం తాజాగా ప్రకటించిన స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు వెల్లడించింది. అన్నదమ్ములిద్దరికీ ఒకేసారి, ఒకే ఉద్యోగాలు లభించడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ఎమ్మెల్యే... డాక్టరు రాగమయి!



చిన్నారిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ: తల్లాడ మండలంలో పలు కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి డాక్టర్‌గా తన వృత్తిధర్మాన్ని కూడా నెరవేర్చారు. మండలంలోని గూడూరుకు వచ్చిన ఎమ్మెల్యే రాగమయి అక్కడ ఓ చిన్నారి నీరసంగా ఉండడాన్ని గుర్తించారు. దీంతో సదరు చిన్నారిని పరీక్షించి అవసరమైన మందులు రాసిచ్చారు. ఎమ్మెల్యేగా బిజీ అయినప్పటికీ వైద్యురాలిగా వృత్తి ధర్మాన్ని నెరవేర్చిన ఎమ్మెల్యేను గ్రామస్తులు అభినందించారు.